సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 24 । నవంబర్ । 2024



దేశసేవకు మేముసైతం..

ఎన్‌సీసీ డేను నవంబర్ నాలుగో ఆదివారం జరుపుకుంటారు. ఎన్‌సీసీ డే సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు 'సాక్షి'తో ముచ్చటించారు. 8లో▸



పెళ్లికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి

బంధువుల పెళ్లికి ఉదయం కారులో సంబురంగా వెళ్లిన ఆ కుటుంబం.. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
29.5 /15.6

వాతావరణం

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. చల్లగాలులు వీస్తాయి.

మెనూ అమలు చేస్తున్నారా..

- శుభ్రత పాటిస్తున్నారా..!?
- హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు
- వంటకాల పరిశీలన.. సరుకుల వివరాలు ఆరా..



హాజీపూర్ కేజీబీవీలో భోజన నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్‌దీపక్



సరుకులను పరిశీలిస్తున్న మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యార్థుల మెస్ చార్జీలను 40 శాతం పెంచింది. నవంబర్ 1 నుంచి పెంచిన చార్జీలు అమలులోకి వచ్చాయి. చార్జీలు పెంచి నెల రోజులైనా హాస్టళ్లు, గురుకులాల్లో మెనూ మారలేదు. భోజనం మెరుగు పడలేదు. నాసిరకం సరుకులతో చేసే వంటలు తిని విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేయాలని మండలాల స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా స్పెషల్ ఆఫీసర్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, సాంఘిక సంక్షేమ, మైనారిటీ, బీసీ గురుకుల పాఠశాలల్లో తనిఖీలు చేపట్టారు. కిచెన్, స్టోర్ రూం పరిశీలించారు. చెక్ లిస్ట్ చేత పట్టుకుని మెనూ అమలవుతుందా? వంట గదుల్లో శుభ్రత పాటిస్తున్నారా..? భోజనం కడుపు నిండా పెడుతున్నారా..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేశారా? స్టాక్ రిజిస్టర్‌లో ఎఫ్ఎస్, విద్యార్థుల సంతకం ఉందా లేదా అని సరిచూశారు. సరఫరాచేసిన బియ్యం సన్నరకం, దొడ్డు రకమా.. వంటకు వినియోగించే సరుకుల గడువు తేదీ ఉందా లేదా నిర్ధారించుకున్నారు. బియ్యం కూరగాయలలో పురుగులు, తెగుళ్లు, బహిర్గతమైన ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన ఫొటోలను తీసుకున్నారు. వంట పాత్రల శుభ్రతను కూడా పరిశీలించారు. భోజనానికి ముందు, తర్వాత హ్యాండ్ వాష్ చేసుకునే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారా.. ఏమైనా సూచనలు ఇచ్చారా..? విద్యార్థులు భోజనం చేశారా.. సంతృప్తికరంగా ఉందా.. ఇంకేమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు.

అధికారుల దృష్టికి అనేక సమస్యలు..

ఇక తనిఖీలకు వెళ్లిన అధికారుల దృష్టికి అనేక సమస్యలు వచ్చాయి. భవనాల పైకప్పులు పెచ్చులు ఊడుతున్నట్లు ఫిర్యాదులు చేశారు. మెడిసిన్ కిట్‌లో మందులు లేవని తెలిపారు. తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక తనిఖీల గురించి ముందే తెలుసుకున్న కొందరు నిర్వాహకులు జాగ్రత్త పడ్డారు. జిల్లాలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు లక్సెట్టిపేటలో స్పోర్ట్స్ మీట్ జరుగుతుండటంతో వార్డెన్లు అందుబాటులో లేకపోవటంతో ఆదివారం తనఖీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఆదివారం కూడా తనిఖీలు చేసిన తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నారు. మంచిర్యాల బీసీ హాస్టల్, ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ తనిఖీ చేశారు. రాత్రి పూట అందించిన భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం, సరుకులు పరిశీలించారు. గదులను కలియతిరిగారు.

కేజీబీవీలో కలెక్టర్ తనిఖీ



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, రేషన్ సరుకుల గది, మూత్రశాలలు పరిశీలించారు. రిజిస్టర్లు తనిఖీ చేసి స్టాక్ వివరాలు ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించి పోషక విలువలతో కూడి భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, కార్యదర్శి వెంకటస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

దండేపల్లిలో..



దండేపల్లి ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి..

దండేపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లతోపాటు, కేజీబీవీని జిల్లా దళిత అభివృద్ధి అధికారి, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టళ్లలోని వంట గదులు, కూరగాయలను, ఆహార పదార్థాలను పరిశీలించారు. నాణ్యమైన తాజా కూరగాయాలు మాత్రమే వండాలని, కుళ్లిన వాటిని పడేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత ఉన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు సీవోఈ విద్యార్థి



లక్ష్మీనరసింహను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) విద్యార్థి పొట్ట.లక్ష్మీనరసింహ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. గురుకులంలో 8వ తరగతి చదువుతున్న లక్ష్మీనరసింహ ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి అండర్ -14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సదరు విద్యార్థిని సీవోఈ గురుకులంలో ప్రిన్సిపాల్ డి.శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ విజయసాగర్ శనివారం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు అల్లూరి వామన్, ఎం.రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి



వర్షిత్‌తో ప్రిన్సిపాల్, పీఈటీ

కాసిపేట: మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి బి.వర్షిత్ పాఠశాల రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆసిఫాబాద్‌లోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్-17 నెట్‌బాల్ పోటీల్లో వర్షిత్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. మహబూబ్‌నగర్‌లో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లినట్లు తెలిపారు. వర్షిత్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

భీమారం: వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని అదనపు కలెక్టర్ మోతీలాల్ రైతులకు సూచించారు. భీమారం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకి అమ్ముకుని ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. హార్వెస్టింగ్ చేసే సమయంలో 18 ఆర్‌పీఎం పెట్టి హార్వెస్టింగ్ చేయాలని ఆపరేటర్లకు చెప్పాలన్నారు. ధాన్యం తేమ శాతం నిర్దేశించిన విధంగా వరి కల్లాల్లోనే ఆరబెట్టాలని కోరారు. సన్నరకాలకు బోనస్ కలిపి క్వింటాల్‌కు రూ.2,820 చెల్లిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోతన్‌పల్లి, సుంకరిపల్లి, బూర్గుపల్లి, పోలంపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో ఉన్న స్టాక్‌తోపాటు రైతులు తెచ్చిన వరిధాన్యం పరిశీలించారు.

దివ్యాంగుల రిలే దీక్ష



దీక్ష చేస్తున్న దివ్యాంగులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం రిలే దీక్షలు ప్రారంభించారు. దివ్యాంగుల పోరాట సమితి జాతీయ కోర్‌కమిటీ కోచైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. 2016 చట్టాన్ని అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేయాలని, ప్రభుత్వ కార్యాలయంలో ర్యాంపులు నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, రుణాలు అందించాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచాలన్నారు. దీక్షలో బీవీ.అప్పారావు, ఇందూరి రమేశ్, రాంజేంద్రప్రసాద్, నరేశ్, ప్రకాశ్, రాజశేఖర్, మల్లేశ్, గోపాల్ రామ్, లింగమూర్తి, సుశీల, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కోటపల్లి: మండలంలోని శెట్‌పల్లి, బమన్‌పల్లి, మల్లంపేట, కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలను డీఈవో యాదయ్య శనివారం తనిఖీ చేశారు. శెట్‌పల్లి, బమన్‌పల్లి పాఠశాలను తనిఖీ చేసే సమయంలో ఉపాధ్యాయులు కోమట్ల బాపు, నాగేందర్, రవి అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎస్‌వో హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంచాలి

వేమనపల్లి: లైబ్రరీలతో విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని డీఈవో యాదయ్య అన్నారు. మండలంలోని నీల్వాయి ఎంపీపీఎస్‌లో యూఎస్ఏఐడీ సహకారంతో రీడ్ టూ ఇండియా వారు ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడం అలవాటు చేయడానికి మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెరీ కార్యక్రమం ఎస్ఎల్‌కు అనుబంధంగా విద్యాశాఖ సమన్వయంతో ప్రతీ మండలానికి ఒక మోడల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ లైబ్రరీలలో రంగు రంగుల పఠన సామగ్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఇంటివద్ద విలువలతో కూడిన విద్యాభ్యాసం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో చౌదరి, ఎంఈవో శ్రీధర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం గిరిధర్‌రెడ్డి, హెచ్ఎం మధుకర్, ఉపాధ్యాయులు, పీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



నీల్వాయి పాఠశాల విద్యార్థులతో డీఈవో

'ఎమ్మెల్సీ' ముసాయిదా ఓటరు జాబితా విడుదల

	పురుషులు	మహిళలు	మొత్తం
పట్టభద్రులు	17,414	10,699	28,113
ఉపాధ్యాయులు	863	542	1,405

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను శనివారం విడుదల చేశారు. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు ప్రత్యేక కేంద్రాల ద్వారా, ఆన్‌లైన్ ద్వారా ఓటరు దరఖాస్తులు స్వీకరించగా శనివారం ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశారు. 18 మండలాల్లోని 40 పోలింగ్ కేంద్రాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేసేందుకు 17, 414 మంది పురుషులు, 10,699 మంది మహిళలు ఓటరుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు మొత్తం 28,113 మంది కాగా, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటర్లుగా 863 మంది పురుషులు, 542 మంది మహిళలు నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లుగా మొత్తం 1,405 మంది నమోదు అయ్యారు. ఇంకా డిసెంబర్ 6 వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. 24 నుంచి డిసెంబర్ 9 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. అభ్యంతరాలు పరిష్కరించి డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

సర్వే వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



సర్వే వివరాల ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సూచించారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేషన్ బ్లాక్‌లలో సేకరించిన కుటుంబ సభ్యుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ తప్పులు లేకుండా ఎంటర్ చేయాలన్నారు. రోజువారీ లక్ష్యాన్ని ఆపరేటర్లు ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నమోదు చేసేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీఓ ప్రసాద్ ఉన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పకడ్బందీగా జరగాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి పౌరసరఫరాల, వ్యవసాయ, సహకార, గ్రామీణాభివృద్ధి అధికారులతో ధాన్యం సేకరణపై శనివారం సమీక్ష నిర్వహించారు. కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని సేకరించాలన్నారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతోపాటు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వడం జరగుతుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల వివరాలు వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. వివరాల నమోదు సమయంలో ఐరిస్ సమస్య ఉంటే ఓటీపీ పద్ధతిన నమోదు చేయాలన్నారు. జిల్లాకు 40 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా 36 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాబ్ ఆపరేషన్.. మాక్ డ్రిల్



ఆందోళన కారులను చెదరగొట్టే సన్నివేశంలో పోలీసులు



రబ్బర్ బుల్లెట్లు పేల్చే ప్రదర్శనలో పోలీసులు

మంచిర్యాలక్రైం/బెల్లంపల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టే కీలకమైన మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్‌ను రామగుండం కమిషనరేట్‌లో, బెల్లంపల్లి ఆర్మ్‌డ్ రిజర్వుడ్ (ఏఆర్) పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏసీపీ సుందర్‌రావు ఆధ్వర్యంలో బెల్లంపల్లి, జైపూర్, మంచిర్యాల పోలీసు సబ్ డివిజన్‌ల పరిధిలోని సివిల్, ఏఆర్ పోలీసులకు మాక్ డ్రిల్ ప్రాక్టీస్ చేయించారు. పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగే సమయంలో ఎలా కంట్రోల్ చేయాలని, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే నియంత్రించాల్సిన పద్ధతులు, ఆ సమయంలో ప్రదర్శించాల్సిన సమయస్ఫూర్తిపై ప్రాక్టిస్ చేశారు. ఆందోళనకారులు, అల్లరి మూకలను ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు, వినకపోతే మేజిస్ట్రేట్, ఉన్నతాధికారుల అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించడం, తర్వాత ఫైర్ డిపార్ట్‌మెంట్ వారితో వాటర్ క్యానన్ ప్రయోగించడం , ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీచార్జి చేయడం, రబ్బరు పెల్లెట్స్‌తో ఫైరింగ్ చేయడం తదితర అంశాలు ప్రాక్టీస్ చేశారు. మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు , చెన్నూర్ టౌన్ సీఐ రవీందర్, ఆర్ఐలు వామనమూర్తి , ఆర్ఎస్సైలు ప్రవీణ్, సరిత, బెల్లంపల్లి, మంచిర్యాల, జైపూర్ సబ్ డివిజన్లకు చెందిన ఎస్సైలు, ఏఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికులకు వంటల పోటీలు



వంటల పోటీలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో మధ్యాహ్న భోజనం కార్మికులకు శనివారం వంటల పోటీలు నిర్వహించారు. ఇప్పటికే పాఠశాల స్థాయిలో రుచికరమైన భోజనం తయారు చేసిన కార్మికులతో కలిపి మండలానికి ఒక టీం చొప్పున జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 18 మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పోటీల్లో పాల్గొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో గ్యాస్ స్టౌలు, సరుకులు అందించారు. పోటీల్లో పాఠశాల ఆహార పట్టికలోని వంటకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. కూరగాయలు, ఆహార భద్రత అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పోటీలో పరిగణలోకి తీసుకున్నారు. డీఈవో యాదయ్య పోటీలను పరిశీలించారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం రుచికరమైన వంట తో పరిశుభ్రత పాటించాలని సూచించారు. న్యాయ నిర్ణేతగా కాసిపేట పాఠశాల హెచ్ఎం సాంబమూర్తి వ్యవహరించారు. పోటీల నిర్వాహకులుగా ఎంఈవో మాలవీదేవి, సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, డీఎస్‌వో మధుబాబు, రమణ, జెడ్పీ బాలుర ఉన్నత హెచ్ఎం పద్మజ వ్యవహరించారు.

విజేతలు వీరే..

వేమనపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విజయ మొదటి బహుమతి సాధించగా, మందమర్రి ఆదర్శ పాఠశాలకు చెందిన సునీత రెండో బహుమతి, లక్సెట్టిపేట్ బాలికల పాఠశాలకు చెందిన సత్తెమ్మ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు డీఈవో యాదయ్య నగదు పారితోషికం అందించారు.

శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- జిల్లా జడ్జి శ్రీనివాసులు



కోర్టులోని రికార్డు గదిని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

లక్సెట్టిపేట: మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు భవనాన్ని శనివారం పరిశీలించారు. వేడుకల నిర్వహణకు కోర్టు ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లు, మరమ్మతులను పరిశీలించారు. వేడుకల ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ కోర్టు మరమ్మతు పనులు పెయింటింగ్, శానిటైజేషన్ పదిరోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. అనంతరం కోర్టు ఆవరణలోని రికార్డు గదులు, బార్ కార్యాలయాన్ని, కోర్టు హాల్‌ను పరిశీలించారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పుల సత్యం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దండేపల్లి: చట్టాలపై అందరికీ కనీస అవగాహన కలిగి ఉండాలని లక్సెట్టిపేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. దండేపల్లి మండలం నంబాల గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ, సాదా బైనామాలతో భూములు కొనుగోలు చేసిన వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. లేదంటే భూతగాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులుపడాల్సి వస్తుందన్నారు. రెవెన్యూ, భూచట్టాల గురించి కూడా తెలుసుకోవాలని తెలిపారు. అందరూ చట్టాలను గౌరవించాలని అతిక్రమించొద్దని పేర్కొన్నారు. ఈ సదర్భంగా పలు చట్టాలను గురించి జడ్జితోపాటు, న్యాయవాదులు ప్రజలకు వివరించారు. మహిళా చట్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ సత్యం, ఎస్సై ఉదయ్‌కిరణ్, ఏవో అజిత్‌కుమార్, ఏఈవో అర్చన, మాజీ సర్పంచ్ పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక


మౌనిక

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడకు చెందిన గడ్డం మౌనిక ఇటీవల వెలువడిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ంది. ఎంఎస్సీ మ్యాథ్స్ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసిన ఆమె జేఎల్ పరీక్ష రాసింది. ఫలితాల్లో ఎంపికకావడంపై తల్లిదండ్రులు గడ్డం శ్రీవాణి –గోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

27 నుంచి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ లీగ్ పోటీలు

రామకృష్ణాపూర్: ఈనెల 27 నుంచి 29 వరకు పట్టణంలోని ఠాగూర్ స్టేడియం, మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పూల్ ఏ, పూల్ బీలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మొత్తం తొమ్మిది జట్లు లీగ్ మ్యాచ్‌ల్లో తలపడనున్నాయని తెలిపారు. ఈనెల 29న మంచిర్యాల వివేకవర్ధని డిగ్రీ కాలేజీలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు


పరుగు పందెం పోటీలో క్రీడాకారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట మౌంట్ కార్మల్ పాఠశాలలో శనివారం జిల్లా అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమైంది. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, కార్యదర్శి ఈ.మారయ్య, మౌంట్ కార్మల్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఆల్ఫీ ఈ పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పరుగు పందెం, షార్ట్‌పుట్, లాంగ్ జంప్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలతోపాటు ప్రోత్సాహక సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జీవరత్నం, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.నరేందర్, పీఈటీ రాంవేణు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్ర వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు శనివారం సొనాల బస్టాండ్ సమీపంలో గ్రామానికి చెందిన తుల గంగయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆయన్ను స్థానికులు బోథ్ సీహెచ్‌సీ ఆస్పత్రికి అటు నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బస్సును స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, దొడ్డిదారిన ప్రైవేట్ బస్సులు మహారాష్ట్ర నుంచి బెంగుళూరుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

గుప్తనిధుల తవ్వకాలకు యత్నం


పూజలు చేసిన దృశ్యం

బోథ్: గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు యత్నించారు. మండలంలోని సొకెర శివారులో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సొకెర శివారు గల పురాతన గడి వద్ద గుప్తనిధుల తవ్వకాలు జరిపే చోటు వద్ద కొందరు నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పసుపుతో పూజలు చేశారు. ఈ తతంగం ఓ వ్యక్తి ద్వారా బోథ్ పోలీసులకు చేరింది. కాగా గుప్తనిధుల కోసం తవ్వడానికి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు వస్తున్నారని తెలియడంతో సదరు వ్యక్తులు పారిపోయారు. అయితే మహారాష్ట్రకు చెందినవారే ఉంటారని భావిస్తున్నారు. మండలానికి చెందిన వ్యక్తి ద్వారానే ఈ ప్రణాళిక చేశారని తెలుస్తోంది. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దేశసేవకు మేముసైతం..

- డిఫెన్స్ రంగంపై కేడెట్ల ఆసక్తి
- 150 మందికి పైగా ఆర్మీ కొలువులు
- నేడు ఎన్‌సీసీ దినోత్సవం


మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: దేశంలో నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) డే నవంబర్ నాల్గవ ఆదివారం రోజున జరుపుకుంటారు. క్రమశిక్షణ కలిగిన యువతను దేశభక్తి పౌరులుగా తీర్చిదిద్దడమే దీని లక్ష్యం. కేడెట్లలో కర్తవ్య భావం, నిస్వార్థ సేవ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే దీని ఉద్దేశం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేడెట్లు త్రివిధ దళాల్లో కొలువులు సాధించి దేశ సేవలో పాల్గొంటున్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలు సాధించేలా శ్రమిస్తున్నారు. ఎన్‌సీసీలో సీ సర్టిఫికెట్ సాధించి డిఫెన్స్ రంగంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎన్‌సీసీ డే సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు 'సాక్షి'తో ముచ్చటించారు.

క్రమశిక్షణకు ఎన్‌సీసీ

దేశవ్యాప్తంగా యువత క్రమశిక్షణకు ఎన్‌సీసీకి పేరుంది. కర్తవ్యం, నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ, నైతిక విలువలతో వారి సర్వతోముఖాభివృద్ధికి అవకాశాలను అందిస్తోంది. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవలు, తదితర శిక్షణపై కేడెట్లను తయారు చేస్తోంది. ఇందులో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1984లో ఎన్‌సీసీ 32(ఏ)బీఎన్ ఆదిలాబాద్ యూనిట్ బెటాలియన్‌గా ఏర్పాటైంది. ప్రారంభంలో అవగాహన లేకపోవడంతో తక్కువ మంది ఎన్‌సీసీలో చేరారు. రానురాను మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఎన్‌సీసీలో శిక్షణ పొందారు. వేలాది మంది ఆర్మీ, నేవీ, బీఎస్‌ఎఫ్, సీఆర్పీఎఫ్ వివిధ రక్షణ శాఖల్లో సుమారు 150 మందికి పైగా ఉద్యోగాల్లో చేరారు.

ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశం

ఎన్‌సీసీ 1948 జూలై 16న ఐక్యత క్రమశిక్షణ అనే నినాదంతో వచ్చింది. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఏ,బీ,సీ సర్టిఫికెట్లు అందజేస్తారు. శిక్షణలో రాష్ట్రాలు, జిల్లాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చినవారికి ర్యాంక్‌లు అందిస్తారు. ఆర్‌డీసీ(రిపబ్లిక్ డే క్యాంపు) నిర్వహిస్తారు. ఏటా జనవరి 15న ఢిల్లీలో జరిగే పరేడ్‌కు ఎంపిక చేస్తారు. ఆర్‌డీ క్యాంప్‌నకు సెలెక్ట్ అయినవారికి డ్రిల్, లైన ఫ్లాగ్‌ఏరియా, కల్చరల్ ప్రోగ్రాం, బెస్ట్ కేడెట్ పోటీలు ఉంటాయి. రాష్ట్రాలకు చెందిన వారు పోటీ పడుతుంటారు. కార్యక్రమానికి రాష్ట్రపతి, ప్రధాని, మంత్రులు, ఢిల్లీ సీఎం, త్రివిధ దళాధిపతులు హాజరవుతారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన వారికి ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. రక్షణ దళంలో ఉద్యోగం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది.

డిఫెన్స్ ఉద్యోగాల్లో రిజర్వేషన్



ఎన్‌సీసీలో శిక్షణ పొందినవారికి డిఫెన్స్ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సీఐఎస్‌ఎఫ్, ఆర్మీ ఉద్యోగాలు సాధించారు.

– జాడి మహేశ్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్

దేశ సేవే లక్ష్యంగా



దేశ సేవచేయడమే తన లక్ష్యం. నేవీ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలనేది తన చిన్నప్పటి కల. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసి ఉద్యోగం సాధిస్తాను. ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నాను.

– బి.సంతోష్, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్

నేవీ ఆకాడమీలో చేరాలని..



ఇండియన్ నేవీ అకాడమీలో చేరాలని ఉంది. నేవీ ఆఫీసర్ ఉద్యోగం సాధించి తన కల సాకారం చేసుకుంటాను. కళాశాలలో చేరి ఎన్‌సీసీ శిక్షణ పూర్తిచేస్తాను. డిఫెన్స్ రంగంలో ఉద్యోగం సాధించేలా కృషిచేస్తాను.

– ఎం.అజయ్‌గౌడ్, సీనియర్ ఎన్‌సీసీ కేడెట్

సేవాభావం పెరిగింది



ఎన్‌సీసీలో చేరిన తర్వాత సేవాభావం, క్రమశిక్షణ పెరిగింది. విద్యతోపాటు ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్నాను. ఫైరింగ్, పరేడ్ పోలీస్ ఉద్యోగాలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతాయి. ఎస్సై ఉద్యోగం సాధిస్తా. ఎన్‌సీసీ.. భవిష్యత్తుకు బాటలు వేసుకునే మార్గం.

– ఏ.అజయ్, జూనియర్ ఎన్‌సీసీ కేడెట్

ఆర్మీ ఆఫీసర్‌నవుతా



మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తర్వాత ఎన్‌సీసీలో చేరాను. డిగ్రీతోపాటు ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ సాధించాక ఆర్మీ ఆఫీసర్‌నవుతా. చిన్ననాటి నుంచి పోలీస్ ఉద్యోగం ఇష్టం. కరాటేలో ప్రావీణ్యం ఉంది.

– శ్రీహిత, ఎన్‌సీసీ కేడెట్

ఆత్మస్థైర్యం పెరిగింది



ఎన్‌సీసీలో చేరిన తర్వాత ఆత్మస్థైర్యం పెరిగింది. ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటే ఆర్మీ, డిఫెన్స్‌ల్లో ఉద్యోగాలు సులువుగా సాధించవచ్చు. గన్ ఫైరింగ్, పరేడ్, ఫిజికల్ ట్రెనింగ్ తదితర ఉద్యోగాలకు ఎంతో ఉపయోగపడుతాయి. ఆర్మీలో ఉద్యోగం సాధించే దిశగా ముందుకెళ్తున్నాను.

– సౌమ్య, ఎన్‌సీసీ కేడెట్

చెరువుల సందర్శన


బృందానికి సూచనలు చేస్తున్న అధికారులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి అటవీక్షేత్రం పరిధిలోని తుర్కం, యెంగన్న చెరువులను హైదరాబాద్ నుంచి ఐటీకోస్ బృందం పర్యాటకులు శనివారం సందర్శించారు. ఆదివారం వరకు వీరు ఇక్కడే ఉండనున్నారు. అటవీ అధికారులు వారి కోసం శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడకు వచ్చే వలస పక్షులను తిలకించడానికి, అందాలను తమ కెమెరాల్లో బంధించనున్నారు. అటవీ అధికారులు బృందానికి సూచనలు చేశారు. పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఎలూసింగ్ మేరు, సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్‌ఓ నాగినిబాను, ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

భైంసారూరల్: మండలంలోని మాటేగాం వంతెనపై శనివారం వేకువజాము లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ నుంచి విజయవాడకు టైల్స్ లోడ్‌తో లారీ వెళ్తోంది. భైంసా–నిర్మల్ జాతీయ రహదారి మాటేగాం వంతెనపై అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ ఉపేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భైంసా రూరల్ సీఐ నైలు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

నాలుగు రోజులుగా నరకయాతన

- గూడెం వంతెన కింద వృద్ధుడిని వదిలివెళ్లిన ఘటన


వృద్ధుడిని తీసుకెళ్తున్న బంధువులు

దండేపల్లి: అచేతన స్థితిలో ఉన్న వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు రోజుల క్రితం దండేపల్లి మండలం గూడెం గోదావరి నది వంతెనకింద వదిలివెళ్లారు. ఎముకలు కొరికే చలిలో గజగజ వణుకుతూ మూలుగుతు పడి ఉన్న వృద్ధుడిని నది స్నానానికి వచ్చిన కొందరు గమనించారు. అతడితో మాట్లాడి వివరాలు తెలుసుకోగా నా పేరు మార్నేని పోచయ్య, గ్రామం ఇందారం, తనకు ఒక కుమారుడు ఉన్నాడని చెప్పాడు. అతన్ని ఇక్కడ ఎవరు వదిలి వెళ్లింది మాత్రం తెలియదన్నారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించిన వీడియోను స్థానికులు పలు వాట్సాప్ గ్రూప్‌ల్లో వైరల్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ శనివారం సిబ్బందితో అక్కడకు చేరుకుని వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతన్ని మందమర్రిలోని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు

దండేపల్లి: ఓ యువకుడిని హత్యచేసిన వ్యక్తి జైలు నుంచి విడుదలై కొన్నిరోజుల తర్వాత మళ్లీ గ్రామానికి రావడంతో వివాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. దండేపల్లి మండలం గూడెం ఒడ్డెర కాలనీకి చెందిన రాజమౌళి గ్రామానికి చెందిన యువకుడు అనిల్‌ని ఏడాది క్రితం మద్యంలో పురుగులమందు కలిపి తాగించి హత్య చేశాడు. దీంతో రాజమౌళిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఇటీవల జైలు నుంచి విడుదలై కొద్దిరోజులు వేరే చోటు ఉంటున్నాడు. శనివారం ఒడ్డెర కాలనీలోని తన ఇంటికి వచ్చి పరిసరాలను శుభ్రం చేస్తుండగా అనిల్ తండ్రి శంకర్ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకోగా, రాజమౌళితో తమకు ప్రాణహాని ఉందని చెప్పాడు. పోలీసులు విచారణ చేస్తుండగా శంకర్ ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేయగా అడ్డుకున్నారు. నిందితుడు కాలనీలో ఉండకూడదని, మృతుడి తండ్రితోపాటు కాలనీవాసులు డిమాండ్ చేశారు. దీంతో న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

రిమ్స్ సూపర్‌స్పెషాలిటీలో అరుదైన ఆపరేషన్


థైరాయిడ్ కణితితో బాధపడ్డ నర్సవ్వ


ఆపరేషన్ ద్వారా తొలగించిన కణితి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు శనివారం అరుదైన ఆపరేషన్ చేశారు. అంకాలజిస్టు డాక్టర్ జక్కుల శ్రీకాంత్, ఈఎన్టీ సర్జన్ సత్యనారాయణ, అనస్తీషియా బృందం సుమారు గంటన్నర పాటు శ్రమించి ఓ వృద్ధురాలి మెడలో ఉన్న థైరాయిడ్ కణితిని విజయవంతంగా తొలగించారు. అనంతరం వైద్యుడు శ్రీకాంత్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వృద్ధురాలు నర్సవ్వ మెడలో థైరాయిడ్ కణితితో బాధపడుతోంది. ఈనెల 11న రిమ్స్‌లో చేరగా ఈఎన్టీ సర్జన్ సత్యనారాయణ పరిశీలించారు. వైద్య పరీక్షలు నిర్వహించి థైరాయిడ్ కణితి ఉందని గుర్తించారు. బయట నుంచి అది 500 గ్రాములు కనిపించిందన్నారు. ఆపరేషన్ చేసి తీసేసరికి అది కిలోన్నర బరువు ఉందన్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ సూచనతో ఆపరేషన్‌ను విజయవతంగా పూర్తి చేశామని తెలిపారు.

పెళ్లికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి

- డ్రైవర్ అజాగ్రతతో కారు బోల్తా
- అమ్మమ్మ, మనుమరాలు మృతి
- బెల్లంపల్లిలో ఘటన


ప్రమాదానికి గురైన కారు


ప్రియ మేఘన (ఫైల్)



చికిత్స పొందుతూ మృతిచెందిన కళ్యాణి

బెల్లంపల్లి: బంధువుల పెళ్లికి ఉదయం కారులో సంబురంగా వెళ్లిన ఆ కుటుంబం.. కార్యక్రమం అనంతరం ఇంటికి బయల్దేరింది. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా.. డ్రైవర్ నిర్లక్ష్యంతో కారు అదుపు తప్పి రోడ్డుపై పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి కన్నాల బస్తీకి చెందిన టింకరి.కల్యాణి(60), ఆమె కూతురు పారుపల్లి అలేఖ్య, అల్లుడు రాజేశ్, మనుమడు సాయి విక్రాంత్, మనుమరాలు ప్రియ మేఘన((9)తో కలిసి భూపాలపల్లిలో బంధువుల పెళ్లికి కారులో శుక్రవారం ఉదయం బయల్దేరి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత అందరూ తిరిగి బెల్లంపల్లికి బయల్దేరారు. మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకునేలోపు జాతీయ రహదారి ఒక్కసారిగా కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ప్రియ మేఘన అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన టింకరి కళ్యాణి మంచిర్యాలలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనలో అలేఖ్య ఆమె భర్త రాజేశ్ గాయపడ్డారు. కారు డ్రైవర్ కిరణ్‌కుమార్‌తోపాటు, అలేఖ్య కొడుకు సాయి విక్రాంత్ సురక్షితంగా ప్రమాదం నుంచి బయట పడ్డారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది.

నిద్రమత్తే కారణం..

కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. డ్రైవర్ కారును అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతోపాటు నిద్ర కమ్ముకు రావడంతో కారు అదుపు తప్పి బోల్తాపడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మరో పది నిమిషాలు సురక్షితంగా కారు నడిపి ఉంటే.. అందరూ క్షేమంగా ఇంటికి చేరుకునేవారని పేర్కొన్నారు. ఘటనాస్థలిని శనివారం ఉదయం బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై మహేందర్ పరిశీలించారు. అలేఖ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో కార్తికదీపాలు



బాసర: కార్తికమాసం సందర్భంగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శనివారం భక్తులు పూజలు చేశారు. అనంతరం మహాలక్ష్మి, మహంకాళి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు, మహిళలు.. ఓంకారం, స్వస్తిక్, దుర్గామాత వివిధ ఆకృతులతో దీపాలను వెలిగించారు.


ఇద్దరు పోలీసులకు ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం అందుకుంటున్నరూరల్ సీఐ ఆకుల అశోక్


ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై గంగన్న

నస్పూర్/లింగాపూర్: గంజాయి కేసులో నేరస్తులకు శిక్షపడేలా చేసిన ఇద్దరు పోలీసులకు రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందించారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రస్తుత మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ప్రస్తుత లింగాపూర్ ఎస్సై గంగన్న గతంలో ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్నప్పుడు గంజాయి సాగు కేసులో నేరస్తులను కోర్టులో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువు చేయడంతో మేజిస్ట్రేట్.. ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. ప్రశంసాపత్రం అందుకున్నవారిని సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్‌రెడ్డి, ఏసీపీ ప్రకాశ్, లింగాపూర్ పోలీసులు అభినందించారు.

అడవి కుక్కలదాడిలో జింక మృతి


జింక కళేబరం

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ అటవీ ప్రాంతంలో అడవి కుక్కల దాడిలో జింక మృతిచెందింది. శనివారం అటవీ ప్రాంతానికి వెళ్లిన గ్రామస్తులు చూసి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అయితే పులి దాడిలో జింక మృతిచెందిందని గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పులి కాదని అడవి కుక్కలే జింకపై దాడి చేశాయని అధికారులు తేల్చారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి హైవే వద్ద అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి పట్టుకున్నారు. వీటిని ఆర్‌కేపీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంచిర్యాల ఇసుక రీచ్ నుంచి మందమర్రి మండలానికి ఇసుక రవాణాకు ఇంకా ఆన్‌లైన్ ఓపెన్ కాలేదని అప్పటివరకు అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. అనుమతులు ఒక చోట తీసుకుని మరో చోటికి సరఫరా చేయొద్దన్నారు.